# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 21-08-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని.లు

## ముఖ్యాంశాలు

❖ పార్లమెంట్ ఉభయ సభలు ఈరోజు నిరవధికంగా వాయిదా పడ్డాయి.

❖ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రేపు బీహార్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో పర్యటించనున్నారు.

❖ ఆన్‌లైన్ గేమింగ్ బిల్లు-2025కు పార్లమెంట్ ఈరోజు ఆమోదం తెలిపింది.

❖ భారత్, రష్యా దేశాలు తమ ఎగుమతులను పెంచడం ద్వారా ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యాన్ని మరింత విస్తరించాలని నిర్ణయించాయి.

❖ ఐ.ఎన్.డి.ఐ.ఎ. కూటమి ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా బి.సుదర్శన్ రెడ్డి ఈరోజు నామినేషన్ దాఖలు చేశారు.

=======================

పార్లమెంట్ ఉభయ సభలు ఈరోజు నిరవధికంగా వాయిదా పడ్డాయి. దీంతో గత నెల 21న ప్రారంభమైన పార్లమెంటు వర్షాకాల సమావేశాలు ఈరోజుతో ముగిశాయి. మొదటి వాయిదా తర్వాత మధ్యాహ్నం 12 గంటలకు లోక్ సభ సమావేశమైనప్పుడు స్పీకర్ ఓంబిర్లా మాట్లాడుతూ... ఈ వర్షాకాల సమావేశాల్లో ప్రభుత్వం 14 బిల్లులను ప్రవేశపెట్టగా అందులో మొత్తం 12 బిల్లులు ఆమోదించబడ్డాయని చెప్పారు. “ఆపరేషన్ సిందూర్”పై రెండు రోజుల పాటూ ప్రత్యేక చర్చ జరిగిందని, అది ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రసంగంతో ముగిసిందన్నారు. ఈ సెషన్ లో మొత్తం 419 నక్షత్రపు గుర్తు ప్రశ్నలు అజెండాలో చేర్చబడినప్పటికీ విపక్షాలు పలు మార్లు అంతరాయం కలిగించడంతో 55 ప్రశ్నలను మాత్రమే తీసుకోగలిగామని వెల్లడించారు. ఈ సెషన్‌లో సభ కేవలం 37 గంటలు మాత్రమే పని చేసిందని ఓం బిర్లా అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇక రాజ్యసభ రెండవ వాయిదా తర్వాత మధ్యాహ్నం 2 గంటల 38 నిమిషాలకు తిరిగి సమావేశమైనప్పుడు, వర్షాకాల సమావేశాల్లో ప్రతిపక్ష సభ్యులు కలిగించిన అంతరాయంపై డిప్యూటీ చైర్మన్ హరివంశ్ నారాయణ్ సింగ్ అసంతృప్తి వ్యక్తం చేశారు. రాజ్యసభ ఈ సెషన్ లో 41 గంటల 15 నిమిషాలు మాత్రమే పని చేసిందని చెప్పారు. అంతకముందు ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజ్యాంగ 130వ సవరణ బిల్లు 2025, కేంద్రపాలిత ప్రాంత ప్రభుత్వాల సవరణ బిల్లు 2025, జమ్మూ కాశ్మీర్ పునర్ వ్యవస్థీకరణ (సవరణ) బిల్లు, 2025లను రాజ్యసభ మరింత పరిశీలన కోసం పార్లమెంటు సంయుక్త కమిటీకి పంపించింది.

======================

ఆన్‌లైన్ గేమింగ్ ప్రమోషన్ అండ్ రెగ్యులేషన్ బిల్లు, 2025ను రాజ్యసభ ఈరోజు ఆమోదించింది. దీంతో పార్లమెంట్ ఉభయ సభల్లోనూ ఈ బిల్లుకు ఆమోదం లభించింది. ఈ-స్పోర్ట్స్, ఆన్‌లైన్ సోషల్ గేమ్స్ ను ప్రోత్సహిస్తూనే హానికరమైన ఆన్‌లైన్ మనీ గేమింగ్ సేవలు, ప్రకటనలు, వాటికి సంబంధించిన ఆర్థిక లావాదేవీలను ఈ బిల్లు నిషేధిస్తుంది. ఆన్‌లైన్ మనీ గేమింగ్‌కు సంబంధించిన చట్టాన్ని ఉల్లంఘిస్తే మూడు సంవత్సరాల వరకు జైలు శిక్షతో పాటూ కోటి రూపాయల వరకు జరిమానా లేదా రెండూ విధించవచ్చు. ఇక ఈ బిల్లుకు ఆమోదం లభించడంపై కేంద్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి అశ్విని వైష్ణవ్ పార్లమెంట్ వెలుపల విలేకరులతో మాట్లాడుతూ... ఆన్‌లైన్ మనీ గేమింగ్ ప్రజారోగ్యానికి ముప్పుగా మారిందన్నారు. వీటి కారణంగా అనేక కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయని ఆయన పేర్కొంటూ...

(వాయిస్ 35 సెకన్లు)

======================

భారత్, రష్యా దేశాలు తమ ఎగుమతులను పెంచడం ద్వారా ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యాన్ని మరింత విస్తరించాలని నిర్ణయించాయి. రష్యా పర్యటనలో ఉన్న భారత విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ ఈరోజు రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్రెవ్ తో ప్రతినిధి స్థాయి చర్చలు జరిపారు. అనంతరం నిర్వహించిన ఉమ్మడి పాత్రికేయుల సమావేశంలో జైశంకర్ మాట్లాడుతూ... అంతర్జాతీయ ఉత్తర, దక్షిణ రవాణా కారిడార్, చెన్నై వ్లాడివోస్టాక్ తూర్పు సముద్ర కారిడార్ ల గురించి ఈ సందర్భంగా చర్చించామని చెప్పారు. ఈ కారిడార్లు రవాణా సమయాన్ని తగ్గించడంతో పాటూ.. వాణిజ్య ప్రాప్యతను కూడా విస్తరిస్తాయని వ్యాఖ్యానించారు. ఇరు దేశాల మధ్య రక్షణ, సైనిక సాంకేతిక సహకారం బలంగా ఉందని, దానిని తదుపరి స్థాయికి తీసుకువెళ్ళేందుకు కట్టుబడి ఉన్నామని జైశంకర్ పేర్కొంటూ...

(వాయిస్ 37 సెకన్లు)

విరామం

======================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రేపు బీహార్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో పర్యటిస్తారు. ఈ పర్యటనలో భాగంగా బీహార్‌లోని గయలో దాదాపు 13 వేల కోట్ల రూపాయల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రధానమంత్రి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తారు. ఇక పశ్చిమ బెంగాల్ లోని కోల్‌కతాలో కొత్తగా నిర్మించిన మెట్రో రైల్ సేవలను కూడా ఆయన రేపు ప్రారంభిస్తారు. అలాగే 1,200 కోట్ల రూపాయల వ్యయంతో 7.2 కిలోమీటర్ల పొడవైన ఆరు వరుసల కోనా ఎక్స్ ప్రెస్‌వేకు నరేంద్రమోదీ శంకుస్థాపన చేయనున్నారు.

======================

ఐ.ఎన్.డి.ఐ.ఎ. కూటమి ఉపరాష్ట్రపతి అభ్యర్థి బి.సుదర్శన్ రెడ్డి ఈరోజు పార్లమెంట్ హౌస్‌లో నామినేషన్ దాఖలు చేశారు. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు సోనియా గాంధీ, ఎన్‌సిపి నాయకుడు శరద్ పవార్, సమాజ్‌వాదీ పార్టీ నాయకుడు రామ్ గోపాల్ యాదవ్ తదితరులు ఆ సమయంలో బి. సుదర్శన్ రెడ్డి వెంట ఉన్నారు. ఇప్పటికే ఎన్డీఏ కూటమి ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా సి.పి. రాధాకృష్ణన్ నిన్న నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. ఇక నామినేషన్ల పరిశీలన రేపు జరుగనుండగా, ఈ నెల 25 వరకు నామినేషన్లను ఉపసంహరించుకోవచ్చు. వచ్చే నెల 9న ఉపరాష్ట్రపతి ఎన్నిక జరుగనుంది.

======================

భారత అంతరిక్ష రంగం గత 10 సంవత్సరాలలో విశేషమైన పురోగతిని సాధించిందని ఇస్రో చైర్మన్ వి. నారాయణన్ వెల్లడించారు. 2015 నుండి 2025 మధ్య ఇస్రో అనేక విజయవంతమైన ప్రాజెక్టులను చేపట్టిందని తెలిపారు. భారత అంతరిక్ష రంగానికి సంబంధించి గత దశాబ్దంలో మూడు వందల అంకుర సంస్థలు ఏర్పడ్డాయని తెలిపారు. ఈరోజు ఆయన వ్యోమగామి శుభాన్షు శుక్లా, కేంద్ర శాస్త్ర సాంకేతిక శాఖా మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ తో కలిసి న్యూఢిల్లీలో పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శుభాన్షు శుక్లా యాక్సియం మిషన్ గురించి మాట్లాడుతూ... ఇది దేశం మొత్తానికి చెందిన మిషన్ అని క్షేత్రస్థాయిలో నేర్చుకున్న దాని కంటే అంతరిక్షంలో అనుభవం చాలా భిన్నంగా ఉంటుందని చెప్పారు. ఏడాదిగా ఈ మిషన్ కోసం ఎంతో సమాచారం సేకరించామని.. ఆ సమాచారం గగన్‌యాన్ మిషన్‌కు ఉపయోగపడుతుందని శుభాన్షు శుక్లా పేర్కొంటూ...

(వాయిస్ 33 సెకన్లు)

=======================

దీపావళి, చాథ్ పండుగల సందర్భంగా ప్రయాణీకుల సౌలభ్యం కోసం భారతీయ రైల్వే 12 వేలకు పైగా ప్రత్యేక రైళ్లను నడపనుందని ఆ శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. ఈరోజు ఆయన న్యూఢిల్లీలో పాత్రికేయులతో మాట్లాడుతూ... అక్టోబర్ 13 నుండి 26వ తేదీ వరకు ప్రయాణాలు చేసే వారికి అలాగే నవంబర్ 17 నుండి డిసెంబర్ 1 వరకు తిరుగు ప్రయాణాలు చేసే వారి టిక్కెట్లపై 20 శాతం తగ్గింపు అందిస్తున్నామని చెప్పారు. అదే విధంగా గయ నుండి ఢిల్లీకి, సహర్సా నుండి అమృత్‌సర్‌కు, ఛప్రా నుండి ఢిల్లీకి, ముజఫర్‌పూర్ నుండి హైదరాబాద్‌కు నాలుగు కొత్త అమృత్ భారత్ ఎక్స్ ప్రెస్ రైళ్లను ప్రవేశపెట్టనున్నామని కేంద్రమంత్రి తెలియజేశారు.

=======================

జమ్మూ కాశ్మీర్‌లోని శ్రీనగర్‌లో ప్రఖ్యాతి గాంచిన దాల్ సరస్సు వేదికగా మొట్టమొదటి ఖేలో ఇండియా వాటర్ స్పోర్ట్స్ ఫెస్టివల్ ఈరోజు ప్రారంభమయ్యింది. షేర్-ఎ-కాశ్మీర్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్‌లో కొద్ది సేపటి క్రితం జరిగిన ప్రారంభోత్సవంలో కేంద్ర యువజన వ్యవహారాల శాఖ సహాయ మంత్రి రక్ష నిఖిల్ ఖడ్సే, జమ్మూ కాశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా, ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా పాల్గొన్నారు. మూడు రోజుల పాటు జరిగే ఈ స్పోర్ట్స్ ఫెస్టివల్లో 36 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుండి 500 మందికి పైగా అథ్లెట్లు రోయింగ్, కయాకింగ్, కనోయింగ్ క్రీడల్లో 24 బంగారు పతకాల కోసం పోటీ పడనున్నారు.

=======================

ఉత్తరాఖండ్, పంజాబ్, హర్యానా రాష్ట్రాల్లో రేపటి నుండి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (IMD) వెల్లడించింది. అదే విధంగా గుజరాత్, మధ్యప్రదేశ్, జార్ఖండ్ రాష్ట్రాల్లో కూడా రేపు భారీ వర్షాలు కురుస్తాయని IMD తెలిపింది.

=======================
=======================